రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

సుభాష్‌నగర్‌: అర్హులైన రైతులందరూ రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని దూలపల్లి పీఏసీఎస్‌ చైర్మన్‌ గరిసె నరేందర్‌రాజు పేర్కొన్నారు. దూలపల్లిలోని సహకార బ్యాంక్‌ పరిధిలోని బహదూర్‌పల్లి, కొంపల్లి, దూలపల్లి మూడు గ్రామాల్లోని రైతులు ఈనెల 13 లోగా పట్టా పాస్‌ పుస్తకం, ఆధార్‌ కార్డుతో సహకార బ్యాంకులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రమాదవశాత్తు రైతు చనిపోతే బాధిత కుటుంబ సభ్యులకు ఈ బీమా ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు సహకార బ్యాంకులో సంప్రదించాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌

కుత్బుల్లాపూర్‌: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ అన్నారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో శరణప్ప, వాజీద్‌, పార్వతి, వెంకటేశ్వర్‌ రావు, పింకిలకు రూ.2 లక్షలు విలువైన సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్‌ : మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంత్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్‌ నిధులు రూ.20 లక్షలతో బాచుపల్లి పరిధిలోని శ్రీ హోమ్స్‌ కాలనీ 1ఏ, 2బీలో సీసీ రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీవాసులు హన్మంత్‌రెడ్డిని శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ కొలన్‌ కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్‌ కొలన్‌ వీరేందర్‌ రెడ్డి, ఎస్‌ఎంసీ అధ్యక్షుడు కొలన్‌ రాజశేఖర్‌ రెడ్డి, కొలన్‌ జీవన్‌రెడ్డి, గోంగుల జిత్తు, ప్రవీణ్‌గౌడ్‌, రాజేందర్‌, అంజయ్యగౌడ్‌, విజయ పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌ రమేశ్‌కు బెస్ట్‌ అవార్డు ప్రదానం


ఉత్తమ అవార్డుతో జర్నలిస్టు రమేశ్‌

చింతల్‌: హ్యూమన్‌ రైట్స్‌ పబ్లిక్‌ ప్రొటెక్షన్‌ సర్వీస్‌ నేషనల్‌ కమిటీ ఆధ్వర్యంలో అందించే ప్రతిభా పురస్కారాల్లో సోషల్‌ సర్వీస్‌ విభాగంలో బెస్ట్‌ జర్నలిస్ట్‌ అవార్డు కుత్బుల్లాపూర్‌ విలేకరి రమేశ్‌కు లభించింది. రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మానేపల్లి జ్యువెలర్స్‌ అధినేత మానేపల్లి రామారావు, తెలంగాణ ఆర్య వైశ్య ఫెడరేషన్‌ చైర్మన్‌ కాల్వ సుజాత చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. రమేశ్‌ గత 30 ఏళ్లుగా జర్నలిస్టుగా ప్రజా సమస్యలపై, అదేవిధంగా జర్నలిస్టుల సమస్యలపై అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. అలాగే పలువురు జర్నలిస్టులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఘనంగా తీజ్‌ వేడుకలు

మూసాపేట: బాలాజీనగర్‌ డివిజన్‌ పరిధిలోని సేవాలాల్‌నగర్‌లో సోమవారం తీజ్‌ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొలకలను నెత్తిన పెట్టుకుని ర్యాలీగా, బంజారా సంప్రదాయ పద్ధతిలో నృత్యాలు చేస్తూ అమ్మవారికి మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో స్థానికులు కైలా, శంకర్‌, తుకారం, లక్‌పతి, లచ్చిరాం, పాషా, రాందాస్‌, కిషన్‌ తదితరులు పాల్గొన్నారు.

మలయాళీల అభివృద్ధికి కృషి

ఓల్డ్‌ బోయిన్‌పల్లి : మలయాళీల అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్‌ ముద్దం నర్సింహ యాదవ్‌ అన్నారు. వల్లబ్‌నగర్‌లో ఓల్డ్‌ బోయిన్‌పల్లి మలయాళీల అసోసియేషన్‌ భవనంపై నిర్మించిన మొదటి అంతస్తును సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ చైర్మన్‌ అప్పుకుట్టన్‌ నాయర్‌, కార్యదర్శి బాబు, కోశాధికారి వేణుస్వామి జాయింట్‌ సెక్రటరి పద్మనాభన్‌, కనకదాస్‌ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకు రెండేళ్లు..

పనులకు ఇంకెన్నాళ్లో..?

కుత్బుల్లాపూర్‌, గాజులరామారం సర్కిళ్లలో అధ్వానంగా రహదారులు

వర్షాలతో చిద్రమైనా రోడ్లకు మరమ్మతుల్లేక అటు వాహనదారులు.. ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌లో 27 రోడ్లు, గాజులరామారం సర్కిల్‌ పరిధిలో 159 రోడ్లు వర్షాల దాటికి రాళ్లు, గుంతలు తేలి అధ్వానంగా మారాయి. దీంతో వాటికి మరమ్మతులు చేపట్టేందుకు 2023లో రూ.120.93 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదించారు. అయితే జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారుల మధ్య ఎన్‌ఓసీలు జారీ విషయంలో సమన్వయం లోపించడంతో రోడ్ల పునరుద్ధరణ పనులు ముందుకు సాగడం లేదు. దీంతో వాహనదారులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు.

-రంగారెడ్డినగర్‌

- ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోని రోడ్లు
- 2023లో రూ.120.93 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు
- జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారుల మధ్య సమన్వయ లోపం
- ఎన్‌ఓసీల జారీలో తీవ్ర జాప్యం
- ప్యాచ్‌ వర్క్‌లతో మమ అనిపిస్తున్న మాన్సూన్‌ సిబ్బంది
- ఇబ్బందుల్లో వాహనదారులు

మాన్సూన్‌ పనుల కాంట్రాక్టర్‌ చేతివాటం

జంట సర్కిళ్ల పరిధిలో ప్రతి డివిజన్‌కు ఆరుగురు చొప్పున మాన్సూన్‌ సిబ్బందిని రోడ్ల మరమ్మతుల కోసం నియమించారు. అయితే సదరు పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడంతో నాసిరకంగా గుంతలు పూడ్చి చేతులు దులుపుకుంటున్నారు. పనుల సమయంలో ఇంజినీరింగ్‌ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఎక్కువ శాతం కంకర, తక్కువ మోతాదులో డాంబర్‌ మిక్స్‌ చేసి గుంతలు పూడుస్తున్నారు. దీంతో అవి నాణ్యతా లేక కొద్ది రోజులకే రాళ్లు తేలుతున్నాయి.

రెండేళ్లుగా రాళ్లు తేలిన రోడ్డు

రంగారెడ్డినగర్‌ డివిజన్‌ పరిధిలోని రంగారెడ్డినగర్‌ శివాజీ విగ్రహం సమీపంలో రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షంతో రోడ్డు కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. రంగారెడ్డినగర్‌ ప్రధాన రోడ్డుకు మూలమలుపు ఉండడంతో వాహనదారులు జారి పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డును ఆనుకునే గుంతలు

-షాపూర్‌నగర్‌ మొదలు చింతల్‌ వరకు హెచ్‌ఎంటీ పరిధిలోని రోడ్డును ఆనుకుని పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాటిలో నీళ్లు చేరాయి. వాటిని గుర్తించక పలువురు ద్విచక్ర వాహనదారులు అందులో పడి గాయాల పాలవుతున్నారు. మాన్సూన్‌ సిబ్బంది కాంక్రీట్‌తో గుంతలు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. అదేవిధంగా చింతల్‌ ప్రధాన రోడ్డులోని ఐడీపీఎల్‌ వరకు పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి.

ప్యాచ్‌వర్క్‌లు నిర్వహించినా మొదటికే..

-రద్దీగా ఉండే జగద్గిరిగుట్ట ప్రధాన రోడ్డులోని లాస్ట్‌ బస్టాప్‌ ప్రాంతంలో రోడ్డుకిరువైపులా గుంతలు ఏర్పడ్డాయి. గతంలో పలుమార్లు సర్కిల్‌ అధికారులు వాటిని పూడ్చినా మళ్లీ ఏర్పడుతున్నాయి. ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన రోడ్డును పునరుద్ధరించాల్సి ఉంది. అదేవిధంగా జగద్గిరిగుట్ట-సంజయ్‌ గాంధీనగర్‌కు వెళ్లే మూలమలుపు వద్ద ఇటీవల రోడ్డుకు ప్యాచ్‌ వేసినా మళ్లీ గుంతలు తేలాయి.

ట్రాఫిక్‌ను మళ్లించడంతో చిద్రమైన రోడ్డు

ఇటీవల సంజయ్‌గాంధీనగర్‌-జగద్గిరిగుట్ట రోడ్డులో భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు వేసి రోడ్డును పునరుద్ధరించారు. ఈ క్రమంలో జగద్గిరిగుట్ట నుంచి ఐడీపీఎల్‌, బాలానగర్‌ వైపు వెళ్లే వాహనాలను సంజయ్‌గాంధీనగర్‌-గాంధీనగర్‌ రోడ్డు మీదుగా ఐడీపీఎల్‌ రోడ్డుకు మళ్లించారు. భారీ వాహనాల రాకపోకలతో అంతంత మాత్రంగానే ఉన్న ఈ రోడ్డు మరింతగా చిద్రమవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.


రంగారెడ్డినగర్‌ శివాజీ విగ్రహం వద్ద వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డు


జగద్గిరిగుట్ట లాస్ట్‌బస్టాప్‌ సమీపంలో ప్రధాన రోడ్డు ..


షాపూర్‌నగర్‌-ఐడీపీఎల్‌ రోడ్డు పక్కన..


జగద్గిరిగుట్ట-సంజయ్‌గాంధీనగర్‌కు వెళ్లే దారి..


చింతల్‌ ప్రధాన రోడ్డు..


సంజయ్‌గాంధీనగర్‌ -గాంధీనగర్‌ రోడ్డు..

శ్మశానవాటిక పనులు పూర్తి చేయాలి


గాజులరామారం ఉపకమిషనర్‌ మల్లారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న భాస్కర్‌

కుత్బుల్లాపూర్‌: అర్ధాంతరంగా నిలిచిపోయిన శ్మశాన వాటిక పనులను వెంటనే పూర్తి చేయాలని సూరారం డివిజన్‌ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్‌ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఉప కమిషనర్‌ మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళావతినగర్‌లో హిందూ శ్మశానవాటిక, మార్కండేయనగర్‌లోని ముస్లిం శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై ఉపకమిషనర్‌ సానుకూలంగా స్పందించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 21 ఫిర్యాదులు అందాయి. కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ కార్యాలయంలో ఉప కమిషనర్‌ నరసింహ ఆధ్వర్యంలో ప్రజావాణికి ఇంజినీరింగ్‌ 11, ఎలక్ట్రికల్‌ 1, యూబీడీ1, శానిటేషన్‌ 7, అదేవిధంగా గాజులరామారం సర్కిల్‌ పరిధిలో ఇంజినీరింగ్‌ 1 ఫిర్యాదు రావడంతో సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించకుంటే కార్యాలయాన్ని ముట్టడిస్తాం


జలమండలి జీఎం మాధవికి సమస్యను వివరిస్తున్న మహిళలు

చింతల్‌: ప్రజా సమస్యలు పరిష్కరించకుంటే జలమండలి ప్రధాన కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీఆర్‌ఎస్‌ నాయకుడు గుబ్బల లక్ష్మీనారాయణ హెచ్చరించారు. కుత్బుల్లాపూర్‌ జలమండలి కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో సూరారం రాజీవ్‌ గృహకల్పలో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ పైపులైన్‌లపై జీఎం మాధవికి ఫిర్యాదు చేశారు. రాజీవ్‌ గృహకల్ప 13 బ్లాక్‌ వద్ద భూగర్భ డ్రైనేజీ నీరు పైప్‌లైన్‌లోకి వెళ్లకుండా తిరిగి ఇళ్లల్లోకి వస్తున్నాయని, వెంటనే అధికారులు సమస్యను పరిష్కంచాలని కోరారు.

టెండర్ల పూర్తయిన పనులను ప్రారంభించాలి

నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియ పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని సుభాష్‌నగర్‌కు చెందిన భాస్కర్‌ రెడ్డి, కృషికాలనీలో భూగర్భ డ్రైనేజీ లైన్‌కు రూ. 80 లక్షలు మంజూరు చేయాలని రమేశ్‌, అపురూపకాలనీలోని ఎంఆర్‌ఆర్‌ ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్‌లో రూ.13 లక్షలతో తాగునీటి పైపులైన్‌ వేయాలని సుభాష్‌నగర్‌లో రూ.40 లక్షల టెండర్లు మంజూరైన పైపులైన్‌ పనులను వెంటనే ప్రారంభించాలని అంజిరెడ్డి కోరారు. అలాగే రంగారెడ్డినగర్‌ డివిజన్‌ గురుమూర్తినగర్‌లో 15వ బ్లాక్‌ వర్షం పడిన ప్రతిసారి ముంపునకు గురవుతోందని కాంగ్రెస్‌ డివిజన్‌ అధ్యక్షుడు శివకుమార్‌ జీఎంకు ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా నీటి సరఫరా కావడం లేదని ఒక ఫిర్యాదు, బిల్లుల అధికంగా వస్తున్నాయని రెండు ఫిర్యాదులు, డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతున్నాయని మరో రెండు ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో డీజీఎంలు వికాస్‌, రవి, వాటర్‌ వర్క్స్‌ మేనేజర్లు, వాటర్‌ వర్క్స్‌ ఎలక్ట్రికల్‌ మేనేజర్‌ తదితరులు పాల్గొన్నారు.

కొంపల్లిలో ‘చాయ్‌ పే చర్చ’

కుత్బుల్లాపూర్‌: మున్సిపల్‌ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కొంపల్లి మున్సిపల్‌ బీజేపీ అధ్యక్షుడు పెద్దబుద్దల సతీశ్‌సాగర్‌ అన్నారు. కొంపల్లిలోని పీఆర్‌ రెసిడెన్సీలో బీజేపీ ప్రధాన కార్యదర్శి పల్లికొండ మధు అధ్యక్షతన సోమవారం ‘చాయ్‌ పే’ చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీశ్‌సాగర్‌ మాట్లాడుతూ.. జాతీయ రహదారులు, వీధి దీపాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. స్థానికంగా ఏదైనా సమస్య ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్‌ సభ్యుడు జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చ అధికార ప్రతినిధి సరితరావు, అసెంబ్లీ కో.కన్వీనర్‌ శివాజీరాజు, నాయకులు నరసింహ, గోపాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నర్సింగ్‌రావు మాధురి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో కొంపల్లి బీజేపీ నాయకులు

పనులు త్వరగా పూర్తి చేయాలి

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్‌ ముద్దం నర్సింహాయాదవ్‌ అధికారులకు సూచించారు. సిండికేట్‌ బ్యాంక్‌కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌ను సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ ఆశా, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీకాంత్‌, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సత్‌జ్ఞాన్‌ హైస్కూల్‌లో ఆల్బెండజోల్‌ మాత్రల పంపిణీ


విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

కుత్బుల్లాపూర్‌: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటేశ్వరనగరలోని సత్‌జ్ఞాన్‌ హైస్కూల్‌లో విద్యార్థులకు సోమవారం ఆల్బెండజోల్‌ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్‌ కరస్పాండెంట్‌ లయన్‌ చింతల మల్లేశం మాట్లాడుతూ.. నులి పురుగులతో పోషకాహార లోపం తలెత్తి విదార్థుల్లో రక్తహీనత ఏర్పడుతుందన్నారు. ఎప్పుడూ అలసటగా ఉండి శారీరక పెరుగుదల లేకపోవడం, మానసిక అభివృద్ధిలో మందకొడిగా ఉంటారని ఆరోగ్యవంతమైన పిల్లల కోసం ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. 1-19 ఏళ్లలోపు వారు 6 నెలలకు ఒక టాబ్లెట్‌ తీసుకుంటే నులి పురుగుల బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌ సిబ్బంది వరలక్ష్మి, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నప్పటి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- కలెక్టర్‌ మిక్కిలినేని మనుచౌదరి
- అంకిరెడ్డిపల్లి బీసీ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ స్కూల్‌,కాలేజీ ఆకస్మిక తనిఖీ

కీసర: విద్యార్థులు విద్యార్థి దశ నుండే లక్ష్యాన్ని నిర్దేశించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకునేలా కష్టపడి చదువుకోవాలని మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. సోమవారం కీసర మండలం అంకిరెడ్డిపల్లిలోని మహాత్మాజ్యోతిబాపూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ స్కూల్‌, జూనియర్‌ కళాశాలను కలెక్టర్‌ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణితం, కామర్స్‌, ఎకనామిక్స్‌ సబ్జెక్టులపై బోధించి, స్టాక్‌ మార్కెట్‌, బ్యాంకింగ్‌, షేర్స్‌, టెక్నాలజీ అనాలసిస్‌, ఫండమెంటల్‌ అనాలసిస్‌ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సివిల్స్‌పై ఆసక్తి ఉన్న వారికి మార్గనిర్దేశం..

సివిల్స్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులకు మార్గనిర్దేశం, మెటీరియల్‌ను అందించడమే కాకుండా వారికి సలహా, సూచనలు అందిస్తానన్నారు. దీనికి కలెక్టర్‌ మెయిల్‌ ఐడీని విద్యార్థులకు ఇచ్చారు. స్కూల్‌, జూనియర్‌ కళాశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థుల భోజనంపై ఆరా..

మెనూ ప్రకారం విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, స్నాక్స్‌ అందిస్తున్నారా..? అని ఆరా తీశారు. కీసర తహసీల్దార్‌ అశోక్‌, ప్రిన్సిపాల్‌ రాజమణి, పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అంకిరెడ్డిపల్లి రెసిడెన్షియల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ మనుచౌదరి


జూనియర్‌ కళాశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్‌

జేఎన్‌టీయూ విద్యార్థి సంఘాల నాయకుల నిరసన

బాలానగర్‌: జేఎన్‌టీయూలోని అంబేద్కర్‌ విగ్రహం వద్ద జేఎన్‌టీయూ విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2 యూనివర్సిటీల మధ్య జరిగిన ఎంఓయూలపై అనేక వార్తలు వస్తున్నాయని జేఎన్‌టీయూ అధికారులు విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు వస్తున్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఒప్పందంలో నిజాలు నిర్ధారించేందుకు జేఎన్‌టీయూహెచ్‌ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు కరుణాకర్‌రెడ్డి, దిలీప్‌, అశోక్‌ గౌడ్‌, తేజ, భానుప్రకాశ్‌, జగన్‌, రాహుల్‌, సాగర్‌, జయరాం, విశాల్‌, ఆదిత్య, ధనుంజయ్‌, ఆనంద్‌, ఋత్విక పాల్గొన్నారు.

ఇంట్లో గంజాయి మొక్క పెంచుతున్న వ్యక్తి అరెస్టు

నిజాంపేట్‌: రాజీవ్‌గాంధీనగర్‌లోని ఓ వ్యక్తి తన నివాసంలో అక్రమంగా గంజాయి మొక్కను పెంచుతున్నట్లు బాచుపల్లి పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించగా సుమారు 6 అడుగుల ఎత్తులో ఉన్న గంజాయి మొక్కను గుర్తించారు. ప్రెస్టన్‌ ఫెసిలిటీ ప్రైవేట్‌ ఇండియా లిమిటెడ్‌లో మోంచజ్యోతి బోనియా (43) సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతను ఏడాదిగా బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లో కాలనీలో నివసిస్తున్నట్లు తెలిసింది. మూడేళ్లుగా మోంచజ్యోతి బోనియాకు గంజాయి సేవించే అలవాటు ఉందని, సుమారు 6 నెలల క్రితం వ్యక్తిగత వినియోగం కోసం తన ఇంటిముందు ఈ మొక్కను నాటినట్లు తెలిసింది. సోమవారం బాచుపల్లి పోలీసులు మోంచజ్యోతి బోనియాను అదుపులోకి తీసుకుని, గంజాయి మొక్కను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

